
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★ గురువారం 8 ఆగస్టు 2024



పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి 8లో..

లాభాల వాటాను వెంటనే ప్రకటించాలి 8లో..

కొత్త రేషన్ కార్డులకు ఆటంకాలు



- కార్డుల జారీకి సబ్ కమిటీ ఏర్పాటు
- కమిటీ నివేదిక తర్వాతే దరఖాస్తుల పరిశీలన
- సబ్సిడీ పథకాలకు వేచిచూడాల్సిందే..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కొత్త రేషన్ కార్డుల జారీకి మరికొంత సమయం పట్టే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఇచ్చేవరకు కార్డుల జారీకి అవకాశాలు లేకుండా పోయాయి. ఈ మధ్యలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయితే కొత్త రేషన్ కార్డుల జారీ కావడం ఆలస్యమై, ప్రభుత్వ సబ్సిడీ పథకాలకు దూరం కావాల్సి వస్తుందని అర్హులు ఆందోళన చెందుతున్నారు. తమ అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటిస్తూ వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఎట్టకేలకు వారం రోజుల క్రితం రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కార్డులు జారీ చేస్తామని ప్రకటించిన వెంటనే కేబినెట్ ఆమోదం కూడా పొందింది. ఆ వెంటనే రేషన్ కార్డుల జారీ విధివిధానాల కోసం ప్రభుత్వం ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. దీంతో జిల్లాలో రేషన్ కార్డుల జారీ కోసం దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనే వారిలో ఆశలు చిగురించాయి.

● మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు..

కొత్త రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పౌరసరఫరాల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహా సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉప సంఘం అర్హులైన వారికి రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేయనున్నది. మంత్రివర్గ ఉప సంఘం నివేదికను ముఖ్యమంత్రికి అందజేసిన తర్వాత రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కానుందని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. సబ్‌కమిటీ కార్డుల జారీ కోసం ప్రభుత్వం కొత్తగా మార్గదర్శకాలను రూపొందించిన తరువాత కార్డుల జారీ ప్రక్రియ జిల్లాలో ప్రారంభం అవుతుందని పౌర సరఫరాల శాఖ అధికారులు అంటున్నారు.

దరఖాస్తుదారులకు పంచాయతీ ఎన్నికల భయం..

కొత్త కార్డులు జారీ కానున్నాయని ఆశతో ఉన్న దరఖాస్తుదారులకు పంచాయతీ ఎన్నికల భయం పట్టుకున్నది. ఆగస్టులో గానీ, సెప్టెంబర్‌లో గానీ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఆలస్యం కానున్నదని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ ఎన్నికలు ముగిసిన తర్వాత, జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు జరిగే అవకాశాలు లేకపోలేదు. ఈ సమయంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుండడంతో కార్డుల జారీకి ఆలస్యం జరిగే అవకాశాలు ఉన్నాయి. అప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సౌకర్యం, 500 రూపాయలకే వంట గ్యాస్, తదితర పథకాల లబ్ధి పొందే అవకాశాన్ని కోల్పోనున్నారు.

కానీ పంచాయతీ ఎన్నికలు వారిలో గుబులు పుట్టిస్తున్నాయి. ఆగస్టులో గానీ, సెప్టెంబరులో గానీ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయని, అదే జరిగితే అధికార యంత్రాంగం ఎన్నికల ప్రక్రియలో మునిగి తేలితే కార్డుల జారీలో జాప్యం జరగవచ్చు. కానీ ప్రభుత్వం సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటుందని లబ్ధిదారులు ఆశిస్తున్నారు.

● రెండేళ్లుగా జారీ కాని కార్డులు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ పార్టీ 2018 వరకు క్రమం తప్పకుండా నిరంతరం రేషన్ కార్డులను జారీ చేసింది. 2018 డిసెంబర్లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల అనంతరం మళ్లీ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ రేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసింది. ఆ తర్వాత అనేకమంది దరఖాస్తులు చేసుకోగా, వాటిని 2022 సంవత్సరంలో పరిశీలించి, అందులో అర్హులైన వారికి కార్డులను కొత్తగా జారీ చేశారు. ఆ వెంటనే వెబ్‌సైట్ ను మూసివేసిన ప్రభుత్వం మళ్లీ రేషన్ కార్డులను ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అధికారం చేపట్టగానే రేషన్‌కార్డుల జారీ చేస్తామని ప్రకటించింది. ఇటీవల సబ్‌కమిటీ ఏర్పడడంతో త్వరలో కార్డులు వస్తాయని దరఖాస్తుదారులు ఆశపడుతున్నారు.

● జిల్లాలో 15,670 దరఖాస్తులు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 26 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజా పాలన గ్రామ, వార్డు సభల్లో ఐదు గ్యారంటీ పథకాలు వర్తించేందుకు స్వీకరించిన దరఖాస్తులతో పాటు, కొత్త రేషన్ కార్డుల కోసం కూడా అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. దీంతో జిల్లాలో రేషన్ కార్డుల కోసం 15,670 దరఖాస్తులు వచ్చాయి. వాటిని జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం వచ్చిన 15670 దరఖాస్తులతో పాటు కొత్తగా వచ్చే దరఖాస్తులను పరిశీలించి కొత్త కార్డులను జారీ చేయనున్నారు. అదే విధంగా కుటుంబ సభ్యుల పేర్లు చేర్పులు, మార్పుల ప్రక్రియ కూడా కొనసాగనున్నది.

సీఎంఆర్ లక్ష్యాలను గడువులోగా పూర్తిచేయాలి

- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

పెద్దపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ రైస్ డెలివరీ లక్ష్యాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. 2023-24 ఖరీఫ్, రబీ వరిధాన్యం సీఎంఆర్ డెలివరిపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో బుధవారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ రబీ సీజన్లో సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లుల వారీగా సీఎంఆర్ డెలివరీ లక్ష్యాలు కేటాయించామని, వీటిని రైస్‌మిల్లులు సకాలంలో పూర్తిచేసేలా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైస్ మిల్లుల లక్ష్యాల పూర్తిపై అదనపు కలెక్టర్లు పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ రైస్ డెలివరీ గడువులోగా అందించేలా చూడాలని పేర్కొన్నారు. 2024-25 వానాకాలం సాగు కింద జరుగుతున్న వరిపంట సాగు విస్తీర్ణం, రాబోతున్న ధాన్యం దిగుబడి తగిన విధంగా ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారితోషికం చెల్లిస్తేనే వ్యాక్సిన్ సర్వే చేపడుతాం



జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న జ్యోతి, ఆశా వర్కర్లు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 7 : గ్రామాలు, పట్టణాల్లో వయోజన బీసీజీ వ్యాక్సిన్ సర్వేను ఆశా వర్కర్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా సర్వేకు పారితోషికం చెల్లిస్తేనే సర్వే నిర్వహిస్తామని బుధవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు జి.జ్యోతి మాట్లాడుతూ ఎటువంటి ఫిక్స్‌డ్ వేతనం లేకుండా ఆశా కార్యకర్తలు ప్రస్తుతం ఇచ్చిన సర్వేను నిర్వహిస్తున్నారని, సర్వేలకు పారితోషికం ఇస్తామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికి ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదన్నారు. ఆశా వర్కర్‌లతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, గతంలో లెప్రసీ, టీబీ, ఫీవర్ సర్వేలు చేసినా కూడా ఎలాంటి పారితోషికాలు చెల్లించలేదన్నారు. పారితోషికం ఇస్తేనే సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారితోషికం ప్రకటించాలని లేకుంటే సర్వే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రజిత, స్వప్న, జ్యోతి, అమృత, సరోజన, మంజుల, రేణుకలతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

16నుంచి ఆదివరాహ స్వామి జయంత్యుత్సవాలు

కమాన్‌పూర్, ఆగస్టు 7 : మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి పుణ్యక్షేత్రంలో ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కొసన కాంతారెడ్డి తెలిపారు. 16న నిత్యాభిషేకం, గోపూజ, తీర్థప్రసాద గోష్టి, స్వామివారి హవనము, 17న నిత్యాభిషేకం, గోపూజ, కల్యాణోత్సవం, నిత్యపూర్ణహుతి, విష్ణు సహస్రపారాయణము, నిత్యహోమం, పూర్ణాహుతి, 18న సుప్రభాతం, నిత్యతురురాదన, సేవాకాలము, నిత్యాభిషేకం, గోపూజ, అష్టోత్తర శత ఘటాభిషేక మహోత్సవం, 108 కళశాలతో అభిషేకం, కవచధారణ, మహా ప్రసాద వితరణ, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలని పోస్టుకార్డులు



పోస్ట్ కార్డులతో గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 7 : మూడేళ్లుగా స్కాలర్ షిప్‌లు మంజూరు కాలేదని, పరీక్ష ఫీజులు, ప్రాక్టికల్ రికార్డులు, టెక్స్‌బుక్స్ ఇతర ఫీజులతో తమపై మోయలేని భారం పడుతోందని బుధవారం గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు పోస్టు కార్డుల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని విద్యార్థులు కోరారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు : సీఐ

మంథని, ఆగస్టు 7: మంథని పోలీస్ సర్కిల్ పరిధిలో ఎవరైనా అల్లర్లకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంథని సీఐ బీ రాజు హెచ్చరించారు. మంథని సర్కిల్ పరిధిలోని మంథని, ముత్తారం, రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్, సస్పెక్ట్ కేడీలు, డీసీలను పిలిపించి వారికి సీఐ రాజు బుధవారం మంథని పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

కథల పోటీ ఫలితాలు విడుదల



ఫలితాలను ప్రకటిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 7 : జాతీయ స్థాయి కథల పోటీ ఫలితాలను అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ కలెక్టరేట్‌లో బుధవారం విడుదల చేశారు. కరీంనగర్‌లోని శ్రీరాజ రాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం, మా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో యువతను పెడదారి పట్టిస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఓదెల మండలం కొమిరె గ్రామానికి చెందిన కొత్తిరెడ్డి వినోద స్మారకంగా జాతీయ స్థాయి కథల పోటీ నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల నిర్వాహకులు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ ముంబాయి, మద్రాసు, ఆంధ్ర ప్రాంతాల నుంచి మొత్తం 45 కథలు వచ్చాయని, వాటిని పారదర్శకంగా మూల్యాంకనం చేసి ఫలితాలు వెల్లడించినట్లు తెలిపారు. త్వరలో ఈ కథలను పుస్తక రూపంలో ముద్రిస్తామన్నారు. గుడిపాటి వెంకట హేమలత ప్రథమస్థానం, కృష్ణమాచార్యులు ద్వితీయ స్థానం, గాజోజు నాగభూషణం తృతీయస్థానంలో నిలిచినట్లు ప్రకటించారు. కాగా మరో ముగ్గురిని కన్సోలేషన్ బహుమతులకు ఎంపికచేశారు.ప్రథమ బహుమతి రూ.5000, ద్వితీయ బహుమతి రూ.3000, తృతీయ బహుమతి రూ.2000, 3 కన్సోలేషన్ బహుమతులు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున అందిస్తామని అన్నారు.

జాతీయ రహదారి నిర్మాణానికి సేకరించిన భూముల్లో పంటల సాగు వద్దు : కలెక్టర్

మంథని, ఆగస్టు 7: వరంగల్-మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణ పనులు నెల రోజులలో ప్రారంభమవుతాయని, ఈ ప్రాజెక్టు కింద సేకరించిన భూముల్లో రైతులు వానాకాలం పంటలు సాగు చేయవద్దని కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. స్థానిక ఆర్డీవో ఆఫీసులో జాతీయ రహదారి భూసేకరణ అంశంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్-మంచిర్యాల 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి మంథని, ముత్తారం, రామగిరి పరిధిలోని 16 గ్రామాల్లో దాదాపు 1400 మంది రైతులకు చెందిన 500 ఎకరాల భూసేకరణ చేస్తున్నామని, ఇప్పటివరకు 300 మంది రైతులకు 5 కోట్ల పరిహార సొమ్ము చెల్లించామన్నారు. రైతులకు భూసేకరణ పరిహార సొమ్ము చెల్లింపులు వేగవంతంగా పూర్తిచేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఆర్బిట్రేషన్ ప్రక్రియ ద్వారా రైతులకు మెరుగైన పరిహారం అం దుతుందని, దాదాపు ఎకరానికి 20 లక్షల వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఆర్బిట్రేషన్‌కు రైతులు ముందుకు వచ్చే విధంగా తహసీల్దార్లు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో గ్రామాల వారీగా సేకరించాల్సిన భూమిపై తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత భూమిని జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించాలన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూసేకరణ కింద కోల్పోతున్న 500 ఎకరాల్లో ప్రస్తుత వానాకాలం పంట సాగు చేయడానికి వీలులేదని, ఈ భూముల్లో ఎటువంటి పంటలు వేయవద్దని, నెల రోజుల వ్యవధిలో జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రారంభమ వుతాయని, ఈ భూములలో పంట వేస్తే ఎటువంటి నష్టపరిహారం చెల్లించడం జరగదని, ఈ అంశాన్ని రైతులకు స్పష్టంగా తెలియజే యాలని అధికారులకు సూచించారు. అనంతరం మంథనిలోని 50 పడకల మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో జరిగే ప్రసవాల సంఖ్య పెంచాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి వి. హనుమానాయక్, ఆయా మండలాల తహసీల్దార్లు, డాక్టర్ స్రవంతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధికి పెద్దపీట

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఆగస్టు 7: సుల్తానాబాద్ పట్టణ ప్రజల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు 18.41 కోట్ల రూపాయలతో అదనపు వాటర్ ట్యాంక్‌ను నిర్మించనున్నామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానికి పెరికగిద్ద ఆంజనేయ స్వామి ఆలయ అవరణలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ నిర్మాణ శిలాఫలకాన్ని ఎమ్మెల్యే బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.18.41 కోట్ల అంచనా వ్యయంతో పట్టణంలో 14లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను నిర్మించనున్నారని, ఇందుకు సంబంధించి టెండర్ పనులు పూర్తి అయ్యాయని అన్నారు. దాంతో పాటు పట్టణంలో మరో 1700 కనెక్షన్లు ఇవ్వనున్నారని అన్నారు. మానేరు నుంచి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా జరుగుతుందని ఇందుకు సంబంధించిన పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయని అన్నారు.

రూ.9 కోట్లతో రోడ్ల నిర్మాణం

సుల్తానాబాద్ పట్టణంలో ఇరుకుగా ఉన్న రోడ్లను వెడల్పు చేసే కార్యక్రమం జరిగిందని, ఆయా చోట్ల కొత్తగా తొమ్మిది కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని నిధులు సరిపోకపోతే అవసరమైతే మరో పది కోట్లు ప్రభుత్వం నుంచి తెచ్చి దశల వారీగా సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఆగస్టు 15 లోగా రెండు లక్షల రుణ మాఫీ జరుగుతుందని, సాంకేతిక సమస్యలతో ఆగిపోయిన వారికి తర్వాత కూడా వాటిని చేస్తామన్నారు. భవిష్యత్తులో దొడ్డు రకం వడ్లకు కూడా బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతుల పంటల భీమా కూడా త్వరలోనే అమలువుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు, కౌన్సిలర్ చింతల సునితరాజు, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కలెక్టరేట్ ఎదుట న్యాయవాదుల నిరసన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 7 : జనగామ బార్ అసోసియేషన్ సభ్యులు అమృత్ రావు, కవితలపై పోలీసుల దాడి, పోలీసులు కోర్టు ఉత్తర్వులను అమలు చేయనందుకు నిరసనగా సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు మద్దతుగా పెద్దపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. కలెక్టరేట్, డీసీపీ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, ఆగస్టు 7: సుల్తానాబాద్ కోర్టులో న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ జడ్జిగా దుర్గం గణేష్



జడ్జికి మొక్కను అందిస్తున్న న్యాయవాదులు

సుల్తానాబాద్, ఆగస్టు 7: సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా దుర్గం గణేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గోదావరిఖని కోర్టు నుంచి సుల్తానాబాద్ కోర్టుకు బదిలీపై వచ్చిన జడ్జి గణేష్‌కు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్వాగతం పలికి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్, ఏపీపీ శ్యామ్ ప్రసాద్, ఏజీపీ ఆవుల లక్ష్మీరాజల తదితరులు ఉన్నారు.

పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలి : కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న ఆర్‌బీఎస్‌కే వాహనాల ద్వారా ప్రతిరోజు కనీసం 120 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లో ఆర్‌బీఎస్‌కే సేవలు, ఎన్‌సీడీ సర్వేపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 10ఆర్‌బీఎస్‌కే వాహనాలు ఉన్నాయని, ప్రతి వాహనంలో వైద్యులు, ఫార్మసిస్ట్ , ఏఎన్‌ఎం బృందంగా ఏర్పడి జిల్లాలోని వివిధ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలను సందర్శిస్తూ పిల్లల ఎదుగుదలను, వారి ఆరోగ్యానికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వాహనాలతో ప్రతి రోజు కనీసం 120 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, వివిధ రకాల చికిత్సలు అవసరం ఉన్న పిల్లలను ఆసుపత్రి రిఫర్ చేసి ఫాలో అప్ చేయాలని తెలిపారు. గుండె, కాలేయం సంబంధిత సమస్యలు ఉన్న పిల్లలకు హైదరాబాదులో చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్ కింద జిల్లాలో 30కి పైగా వయసుగల జనాభాను స్క్రీనింగ్ పక్కాగా చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏఎన్‌ఎం ఆధ్వర్యంలో స్క్రీనింగ్ సజావుగా నిర్వహించి బీపీ, షుగర్ గుర్తించిన రోగులకు వైద్యాధికారి సూచనల మేరకు అవసరమైన చికిత్స చేయాలని, బీపీ, షుగర్ లెవెల్స్ సాధారణంగా ఉండేందుకు వాడాల్సిన మందులను పంపిణీ చేసి వారిని రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సముదాయాలను బలోపేతం చేయాలి

జిల్లాలో ఉన్న 36పాఠశాలల సముదాయాలను బలోపేతం చేయాలని, పాఠశాల సముదాయాల్లోని పాఠశాలల పనితీరు మెరుగుపరిచే దిశగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లో పాఠశాల సముదాయాల పనితీరు మెరుగుపరచడంపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోనే విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లోనే విద్యార్థుల అభ్యాసన సామర్థ్యం మేరకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించే విధంగా అవసరమైన సలహాలు సూచనలు అందజేయాలని, పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను సందర్శిస్తూ విద్యాబోధనను పరిశీలించాలన్నారు. ప్రతినెల పాఠశాలల పనితీరుపై రివ్యూ సమావేశం నిర్వహించుకోవాలని, ఈ సమావేశాల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి, జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ అధికారి పీఎం షైక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 7: కరీంనగర్‌లో రెండు రోజుల కిందట వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడిన కేసులో నిందితుడు మహారాష్ట్ర అమరావతి జిల్లా వరుడ్ ప్రాంతానికి చెందిన దుర్వ అజయ్(20)ను బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. నిందితుడు ఒక వైన్ షాపులో 35 వేల నగదును దొంగిలించాడని, తన అనుచరులతో కలిసి మరో వైన్ షాపులో చోరీకి ప్రయత్నించినట్లు తెలిపారు. నిందితుడిని ఉజ్వలపార్క్ సమీపంలో అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.20 వేల నగదు, సికింద్రాబాద్‌లో దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వీధి కుక్క దాడిలో చిన్నారికి గాయాలు



గాయపడిన చిన్నారి హరినందన్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 7: నగరంలో శాతవాహన యూనివర్సిటీ రోడ్డులోని ఆర్ఆర్ బాంక్విట్ హాల్ ముందు బుధవారం సాయంత్రం రెండేళ్ల వయసు కలిగిన చిన్నారిపై వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. జీవనోపాధి కోసం తంగళ్ళపల్లి పద్మ, వినోద్ అనే దంపతులు కరీంనగర్‌కు వచ్చి కుటుంబంతో జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా, చిన్న కుమారుడు తంగళ్ళపల్లి హరినందన్‌ను అమ్మమ్మ ఆడిస్తుండగా రోడ్డుపై నుంచి వెళ్తున్న వీధి కుక్క దాడి చేసింది.

దీంతో చిన్నారి ముఖం, చేతులపై గాయాలు కాగా కుక్కను అమ్మమ్మతో పాటు అక్కడున్న వారు కుక్కను వెళ్ల గొట్టే ప్రయత్నం చేస్తున్నా బాబును వదిలిపెట్టలేదు. చివరకు ఇటుకలు, రాళ్ళను కుక్కపైకి విసరడంతో చిన్నారిని వదిలిపెట్టి కుక్క వెళ్లింది. స్పృహ కోల్పోయిన చిన్నారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, తమ కళ్లముందే చిన్నారిపై కుక్క దాడి చేయడంతో తల్లిదండ్రులు, అమ్మమ్మ తీవ్రంగా విలపించారు. వీధి కుక్కల బెడదను నివారించి దాడికి గురైన చిన్నారికి మెరుగైన చికిత్స ను అందించి, వారి కుటుంబానికి ప్రభుత్వం సహాయం చేయాలని స్థానికులు కోరారు.

హమాలీలపై కుక్కల దాడి

కోల్‌సిటీటౌన్: గోదావరిఖని కొత్త కూరగాయల మార్కెట్‌లో బుధవారం ఇద్దరు హమాలీలపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో పరమేశ్వర్ అనే హమాలీకి వీపు, తొంటి భాగంలో తీవ్రంగా గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. అక్కడ ఉన్న మిగతా వారు కుక్కలను తరిమికొట్టారు. గాయాలైన పరమేశ్వర్‌ను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి చికిత్స నిమిత్తం పంపించారు.

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/ధర్మారం/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 6,752 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరులోకి తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.75 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 12 టీఎంసీల నీరు మిడ్‌మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6300 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 17.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.25 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మధ్యమానేరు నుంచి నీరు వస్తుండగా రెండు మోటర్ల ద్వారా ప్రతి రోజు 3400క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్‌కు 3,600 క్యూసెక్కుల నీరు వెళుతుందని డీఈ దేవేందర్ తెలిపారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌ను పూర్తిగా నింపిన తర్వాత మండలానికి ఉపయోగపడతాయనుకుంటే గతంలో మాదిరిగానే రంగనాయకసాగర్‌కు ఎక్కువ నీటిని విడుదల చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీఫార్మసీ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 7: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై- 2024 లో నిర్వహించిన బీఫార్మసీ ఏడవ, ఎనిమిదో సెమిస్టర్ పరీక్షల ఫలితాల ను బుధవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in.లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట, ఆగస్టు 7: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఏడు ట్రాక్టర్లను వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం పోలీసులు పట్టుకున్నారు. కోరపల్లిలో 2, సాయి గార్డెన్ దగ్గర 1, ధర్మారం 4, మొత్తం ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వేణు, మహేందర్, పరుశురాము, ప్రవీణ్ కుమార్, తిరు పతి, వి తిరుపతి, కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

సైబర్ వలలో ప్రభుత్వ ఉద్యోగి



సారంగాపూర్, ఆగస్టు 7: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ర్యాగల శివప్రసాద్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నాడు. పనిఒత్తిడిలో భాగంగా తన ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్‌లను ఓపెన్ చేస్తున్న క్రమంలో తన వాట్సప్‌కు ఓ బ్యాంకుకు సంబంధించిన లోగోతో లింక్ వచ్చింది. బ్యాంకు సంబంధించినది అనుకుని ఓపెన్ చేయగా ఏటీఎం పిన్‌ఎంటర్ చేయమని అడగగా ఎంటర్ చేశాడు. దీంతో తన ఖాతా నుంచి రూ. 40 వేలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మెసేజ్ వచ్చింది. మోసపోయానని గ్రహించిన శివప్రసాద్ బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకుని సైబర్‌క్రైం అధికారులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బ్యాంకుకు సంబంధించిన లోగోతో కూడిన మెసేజ్ రావడంతో ఓపెన్ చేసి మోసపోయినట్లు బాధితుడు శివప్రసాద్ పేర్కొన్నారు.

దుంపెట వాసి ఖాతా నుంచి రూ.1.13లక్షలు..

కథలాపూర్: మండలంలోని దుంపెటకు చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం...దుంపెటకు చెందిన వ్యక్తికి వాట్సాప్‌లో ఏపీకే ఫైల్ మెసేజ్ రాగా దాన్ని క్లిక్ చేశాడు. దీంతో 20 దఫాలుగా ఖాతా నుంచి రూ. 1,13,804లు గుర్తు తెలియని వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. యూనియన్ బ్యాంక్ ఖాతాను అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొంటూ వచ్చిన మెసేజ్‌కు స్పందించడం వల్ల సైబర్ నేరగాళ్లు డబ్బులు మాయం చేశారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించ వద్దని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

బుగ్గారం ఆగస్టు7: మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో ఓ వృద్ధుడు రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరా ల మేరకు చిన్నాపూర్ గ్రామానికి చెందిన కలమడుగు వెంకయ్య (76) బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తన ఇంటి ముందు గల జాతీయ రహదారికి అవతలివైపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ధర్మపురి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరుగడంతో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కలమడుగు నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బుగ్గారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

గల్ఫ్ కార్మికుడికి ప్రభుత్వ విప్ అండ

సిరిసిల్లక్రైం, ఆగస్టు 7: సౌదీలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న సిరిసిల్ల పట్టణంలోని సిద్దులవాడకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ అనే 23ఏళ్ల యువకుడికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అండగా నిలిచారు. ఇమ్రాన్ స్వదేశా నికి వచ్చేందుకు అయ్యే విమాన టికెట్లు, ఇతర ఖర్చులను స్వయంగా భరిస్తానని బుధవారం తెలిపారు. ఇమ్రాన్‌ను త్వరలో స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బుధవారం సౌదీలో ఉన్న ఎన్ఆర్ఐ భైరి యాదవ్‌ను ఇమ్రాన్ వద్దకు పంపించి సురక్షితంగా ఇంటికి రప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇండియాకు వచ్చేందుకు అయ్యే ఖర్చులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఇమ్రాన్ వీడియో విడుదల చేశాడు.

జలపాతంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



హర్షిత్ (ఫైల్)

తిర్యాణి, ఆగస్టు 7: తిర్యాణి మండలంలోని గుండాల జలపాతంలో సోమవారం గల్లంతైన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన రిషి హర్షిత్(18) మృతదేహం బుధవారం జలపాతం మడుగులో లభ్యమైంది. మిత్రులతో కలిసి సోమవారం జలపాతం చూడటానికి వచ్చిన రిషి సెల్ఫీ తీసుకునే క్రమంలో జలపాతంలో జారిపడి గల్లంతయ్యాడు. రెండు రోజులపాటు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి బుధవారం మృతదేహన్ని వెలికి తీశారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ సదయ్య, సీఐ చిట్టిబాబు, ఎస్సై రమేష్‌లు పరిశీలించి రిషి మృతదేహన్ని తిర్యాణి పీహెచ్‌సీకి తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సదయ్య మాట్లాడుతూ జలపాతాలకు వచ్చే సందర్శకులు జాగ్రత్తలు పాటించాలని, జాగ్రత్తలు తీసుకోకుండా ఈత రాని వారు నీటిలో దిగి సెల్ఫీలు దిగడం, రీల్స్ చేయడం వంటి వి చేపట్టకూడదన్నారు. మృతుడు సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

గంగాధర, ఆగస్టు 7: గంగాధర మండలం కురిక్యాలకు చెందిన అబ్బిడి అనిల్‌రెడ్డి(30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కురిక్యాల గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా కుంగిపోయి మంగళవారం గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ తరలించగా మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేట మండలంలోని వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి మత్తులో పడొద్దు

తాండ్ర్యాల యువకుడి రిమాండ్

మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

కథలాపూర్, ఆగస్టు 7: గంజాయి మత్తులో పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు సూచించారు. బుధవారం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో తాండ్ర్యాలకు చెందిన కాసారపు వర్ధన్ అనే యువకుడు బుధవారం గంజాయి సరఫరా చేస్తుండగా ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో పట్టుకోగా రిమాండ్ వివరాలను వివ రించారు. గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి పలు గ్రామాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోసాని పేట శివారులో 160 గ్రాముల గంజాయితో వర్ధన్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి సేవించడం, విక్రయించడం వంటివి చేసి యువత భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. నిందితుడిని పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ సురేశ్ బాబు, ఎస్సై నవీన్, కానిస్టేబుల్ పురుషోత్తం, నవీన్‌ను అభినందించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

యువకుడి ఇంటి ఎదుట బైఠాయించిన యువతి

చొప్పదండి, ఆగస్టు 7: పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని ఓ యువకుడి ఇంటి ఎదుట ఓ యువతి బైఠాయించింది. ఎస్ఐ అనూష కథనం మేరకు.. చొప్పదండికి చెందిన చిటిపాక విక్రమ్‌కు మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన యువతితో రెండేళ్ల క్రితం వివాహం నిశ్చయమైంది. తాను దుబాయి వెళ్లి వచ్చిన తరువాత పెళ్లి చేసుకుంటానని చెప్పిన విక్రమ్ ఆ తరువాత మాట మార్చి వేరే అమ్మాయితో వివాహం కుదుర్చుకొన్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువతి విక్రమ్ ఇంటి ఎదుట బైఠాయించింది. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించం

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ

సుభాష్‌నగర్, ఆగస్టు 7: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సూర్యం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పోకడలు పోతోందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలను విస్మరించి బడ్జెట్‌ను ప్రవేశాపెట్టిందన్నారు. గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం విద్య రంగానికి ఒక్క శాతం నిధులు మాత్రమే పెంచిందన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు కేవలం విద్యారంగంలో పనిచేసే ప్రభుత్వ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది జీతభత్యాలకే సరిపోతాయన్నారు. నూతన గురుకులాలకు సొంత భవనాలు, స్థలాల కేటాయింపు ఇప్పటివరకు జరగలేదన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల పరి స్థితి అస్తవ్యస్తంగా ఉందని వారు విమర్శించారు. యూనివ ర్సిటీల్లో కనీసం వైస్ చాన్సలర్లు, బోధన సిబ్బంది లేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు నేటికీ విడుదల చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు, మెస్, కాస్మోటిక్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులందరికీ ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం విద్యారంగంలో మతభావాలను వ్యాపింపచేస్తోందని వారు ఆరోపించారు. నిరుద్యోగ అంశాన్ని పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు అ న్యాయం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లైన్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, జిల్లా నేతలు ముల్కల మారుతి, లోకిని రమేశ్, సన్నీ, రాజేశ్, గణేశ్, రవికుమార్, దేవేందర్, మధుసూదన్, సాయి, స్వప్న, వందన పాల్గొన్నారు.

ఆర్థిక వివాదాలతో జర్నలిస్టు ఆత్మహత్య

తన మృతికి బిల్డర్ భార్య, మరో వ్యక్తి కారణమంటూ ఎమ్మెల్యేకు లేఖ



మధునయ్య (ఫైల్)

కోల్‌సిటీ, ఆగస్టు 7: గోదావరిఖనికి చెందిన సీనియర్ జర్నలిస్టు, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి నాయిని మధునయ్య(62) ఆర్థిక వివాదాలతో బుధవారం తెల్లవారుజామున హనుమాన్‌నగర్‌లోని తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కొచ్చెర్ల ప్రవీణ్ అనే బిల్డర్ భార్య లలిత, పెద్దపల్లి పోషయ్యలు కారణమని పేర్కొన్నారు. ఈ మేరకు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ పేర తన సెల్‌లో మరణ వాంగ్మూలం లేఖ పెట్టాడు. పోలీసులు తెలిపిన వివరాలు...

గోదావరిఖనికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి నాయిని మధునయ్య (62) మల్కాపూర్ శివారులోని జర్నలిస్టు కాలనీలో ఒక ఇల్లు నిర్మించుకునేందుకు కొచ్చెర్ల ప్రవీణ్ అనే బిల్డర్‌తో రూ.40 లక్షలకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. పలు దఫాలుగా ఒప్పందాన్ని మించి రూ.60 లక్షలు చెల్లించాడు. మధునయ్య ఇంటి పక్కన ఉన్న స్థలాన్ని విక్రయిస్తానంటూ ప్రవీణ్ మధునయ్య వద్ద మరో రూ.13లక్షలు తీసుకున్నాడు. కానీ ఆ భూమిని అప్పటికే ప్రవీణ్ పెద్దపల్లి పోషయ్య అనే వ్యక్తిపేర రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయం మధునయ్యకు తెలియడంతో నిలదీయగా ఆ భూమిలో ఇల్లు నిర్మించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని మాట ఇచ్చాడు. ఏడాది క్రితం బిల్డర్ ప్రవీణ్‌ను అతని భార్య లలిత హత్య చేయించింది. ఈ కేసులో లలిత జైలుకు వెళ్లి వచ్చిన తరువాత మధునయ్య ఇంటి నిర్మాణం గురించి, పక్కన ఉన్న స్థలం రిజిస్ట్రేషన్ గురించి పలు మార్లు సంప్రదించారు.

ఈ నెల 4న లలిత, పెద్దపల్లి పోషయ్యలు జర్నలిస్టు కాలనీలోని స్థలం వద్దకు రాగా మధునయ్య, మరో ఇద్దరు వ్యక్తులు వెళ్లి డబ్బుల గురించి అడిగారు. ఆ సమయంలో గొడవ జరిగి బూతులు తిట్టారని, అప్పటి నుంచి తన తండ్రి మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య చేసుకున్న ట్టు మధునయ్య కొడుకు హరీష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా తన తండ్రి మృతికి కొచ్చెర్ల లలిత, పెద్దపల్లి పోషంలు కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని నాయిని హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కొచ్చెర్ల లలిత, పెద్దపల్లి పోషంలపై బీఎన్ఎస్ 108 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

వానాకాలం సాగుకు శ్రీరాంసాగర్ నీరు విడుదల



ఎస్సారెస్పీ నీటిని విడదుల చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగిత్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగు అవసరాల కోసం శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నీటిని బుధవారం అధికారు లు, ప్రజా ప్రతినిధులు విడుదల చేశారు. పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టు వద్ద కాకతీయ కాలువ ద్వారా సాగునీటి సరాఫరాను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. అదే విధంగా సరస్వతీ కాలువకు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి నీటి విడుదల ప్రారంభిం చారు. వానా కాలం సాగు సీజన్‌కుగాను ఎస్సారెస్పీ నీటిని రైతు లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా వారాబందీ పద్ధతి లో సాగు నీటి సరాఫరా కొనసాగించనున్నట్లు అధికారులు ప్రకటిం చారు. కాకతీయ కాలువకు 1,000 క్యూసెక్కుల నీటిని, సరస్వతీ కాలువకు 100 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు, ఈఈ చక్రపాణి, పోచంపాడ్ ఎంహెచ్ఎస్ అండ్ సోలార్ సీఈ రమేశ్‌బాబు, డీఈ జె శ్రీనివాస్, డీఈఈలు,ఏఈఈలు, టీఎస్ జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు, విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులు నిండుగా ఉండడం కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. బుధవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగు తోం ది. ఎస్సారెస్పీలోకి 11,055 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 46.952 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమ యానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరము లకు కలిపి ప్రాజెక్టు నుంచి 1,983 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 42.145 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

గణేశ్‌నగర్, ఆగస్టు 7: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని టీజీ ఎన్పీ డీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో గల విద్యుత్ శాఖలోని ఎం ఆర్టీ, డివిజన్‌లో గల ఎల్‌టి మీటర్స్ ల్యాబ్‌లో సెమీ ఆటోమేటిక్ టెస్ట్ బెంచ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరిక రంతో అత్యంత కచ్చితత్వంతో అన్ని రకాల మీటర్లును పరీక్ష చేయవచ్చని తెలిపారు. వివిధ రకాల పరీక్షలు ఒకేసారి 20 మీటర్లుకు చేయవచ్చన్నారు. అనంతరం డివిజన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆపరేషన్ కరీంనగర్ వి.గంగాధర్, డీఈ టెక్నికల్, కరీంనగర్ విజేందర్‌రెడ్డి, కె.కాళిదాసు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న వరుణ్‌రెడ్డి

కొండగట్టులో సహస్రనామ కుంకుమార్చన

మల్యాల, ఆగస్టు 7: కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధిలో జరుగుతున్న శ్రావణ సప్తాహ ఉత్సవాలలో భాగంగా బుధవారం ఆండాళ్ తిరు నక్షత్రం పురస్కరించుకొని ఆండాళ్ అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఆంజనేయస్వామికి 108 కమలాలతో అర్చన, వెంకటేశ్వరస్వామికి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజలలో ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్ అర్చకులు, వేదపండితులు,విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 7: సిరిసిల్ల పట్టణంలోని మానేరు బ్రిడ్జి కింద బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఈ మృతదేహం కుళ్లిపోవడంతో నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతి చెందని వ్యక్తి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, నీలిరంగు షర్టు, నీలిరంగు పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. గుర్తించిన వారు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ 98666 20105 నంబరులో సమాచారం అందించాలని తెలిపారు.

రేపు గాజులపల్లిలో నాగపంచమి వేడుకలు

మంథనిరూరల్, ఆగస్టు 7: మండలంలోని గాజులపల్లి శ్రీసంతాన నాగేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం నాగపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గౌతం సత్యనారాయణ, శశికళలు బుధవారం తెలిపారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి

పాలకుర్తి, ఆగస్టు 7: ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగడమే లక్ష్యంగా పెట్టుకోవాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి అన్నారు. బుధవారం మండలం పరిధిలోని పుట్నూర్ కేజీబీవీ పాఠశాలలో పలు అంశాలపై ఎస్సై అవగాహన కల్పించారు. అనంతరం కన్నాల టోల్ ప్లాజా వద్ద పెద్దపల్లి సీఐ కె ప్రవీణ్ కుమార్‌తో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో బసంత్‌నగర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగికి అభినందనలు..

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 7 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెలువరించిన ఫలితాల్లో మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన మేకల సుష్మిత ఏఈఈ ఉద్యోగం సాధించింది. సుష్మితను ఆమె తల్లిదండ్రులు సరస్వతి-రాజేశంతో పాటు మాజీ సర్పంచ్ గాండ్ల మల్లేశం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి చేయూత

పాలకుర్తి, ఆగస్టు 7 : మండలంలోని ఈసాలతక్కళ్లపల్లికి చెందిన సంగెం నగేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతునికి భార్య జ్యోతి, కూతురు సుకృతి ఉన్నారు. గ్రామస్తులు, నగేష్ స్నేహితులు 78 వేల రూపాయలు జమ చేసి బసంత్‌నగర్ పోస్టాఫీస్‌లో సుకన్య యోజన పథకంలో ఫిక్స్‌డ్‌డిపాజిట్ చేశారు. బుధవారం పత్రాలను పోస్ట్ మాస్టర్ కన్నం ఓదెలు మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. మాజీ సర్పంచ్ ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, వొడ్నాల సురేష్, కేశ నరేష్, నెరువట్ల ప్రభాకర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

నియామకం

ముత్తారం, ఆగస్టు 7: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బక్కతట్ల వినీత్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.

విద్యార్థిని సన్మానించిన ఎంఈవో

కాల్వ శ్రీరాంపూర్, ఆగస్టు 7: మండలం ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని పెంతల అభిజ్ఞ ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు ఎంపిక కాగా, బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో ఎంఈవో సురేందర్‌కుమార్, ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి సిరిమల్ల మహేష్, ఇతర ఉపాధ్యాయ బృందం విద్యార్థిని, ఆమె తండ్రి రమేష్‌ను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయుడు అమృత సురేష్ కుమార్, ముంజాల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించాలి

కాల్వ శ్రీరాంపూర్, ఆగస్టు 7: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందు చెత్త చెదారంతో నిండి ఉంది. ఇప్పటికే మండలంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతిరోజు ఎస్‌బీఐ బ్యాంకుకు మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు, మహిళలు వస్తూపోతుంటారు. బ్యాంకు ముందు ఇలా అపరిశుభ్రంగా ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయని, బ్యాంకు ముందున్న చెత్త తొలగించాలని బ్యాంకుకు వచ్చే పలువురు కోరుతున్నారు.

కార్మికులకు అండగా ఉంటా..

పాలకుర్తి, ఆగస్టు 7: కేశోరాం కాంట్రాకు కార్మికులకు నిత్యం అండగా ఉండి, వారి కష్టసుకాల్లో పాలుపంచుకుంటానని కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక్ హరి అన్నారు. బుధవారం కార్మికులను కలిసిన హరి మాట్లాడుతూ తమ ప్యానల్‌పై నమ్మకంతో గెలిపించిన కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎలిగేడు, ఆగస్టు 7 : మండలంలోని శివపల్లి గ్రామంలో బుధవారం ముప్పిరితోట గ్రామానికి చెందిన తిరుపతిరావుకు రూ.60వేలు, మల్లయ్యకు రూ.33వేలు, లాలపల్లికి చెందిన లచ్చయ్యకు రూ.14.500 విలువగల చెక్కులను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు దుగ్యాల సంతోస్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, పెద్దపల్లి దేవరాజ్, కొప్పుర తిరుమల్‌రెడ్డి, తాటిపల్లి రామేష్‌బాబు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, బూర్ల వెంకటసత్యం పాల్గొన్నారు.

వైభవంగా ఆండాళ్ తిరునక్షత్ర వేడుకలు

సుల్తానాబాద్, ఆగస్టు 7: అండాల్ తిరునక్షత్ర పర్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం వైభవంగా వేడుకలు నిర్వహించారు. ఆలయంలో ఆండాళ్ అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి పూలతో అర్చన చేశారు. గోదా అష్టోత్తర శత నామాలను పారాయణం చేశారు.

అన్నదానం

సుల్తానాబాద్, ఆగస్టు 7: సుల్తానాబాద్ పట్టణంలోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో బుధవారం ఐలయ్య, శారద దంపతులు అన్నదానం చేశారు. ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, లిఖిత్, చందు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ



పన్నూరులో ప్రజలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ



కమాన్‌పూర్‌లో సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో

రామగిరి ఆగస్టు 7: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు బుధవారం అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మండలంలోని రత్నాపూర్, పన్నూరు గ్రామాల్లో జరుగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామాల్లోని సోక్ పిట్లు, డంపింగ్ యార్డ్, మురికి కాలువల్లో శుభ్రం చేయడం తదితర పనులను అదనపు కలెక్టర్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మురికి కాల్వలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని, నీరు అధికంగా నిలిచే లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడ అవసరమైన ట్రెంచ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు అధికమై సీజనల్‌వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉందని, జిల్లాలో ఎక్కడా నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని, ఇళ్లలో కూడా పాత కూలర్లు టైర్లలో, ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి వేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాలలో అవసరమైన చోట సామాజిక ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాల పరిసరాలను శుభ్రం చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి ఆశా లత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, ఆగస్టు 7 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి, జడ్పీ సీఈవో నరేందర్‌లు అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని పలు వార్డుల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సరఫరా, ఇంకుడుగుంతల నిర్మాణం, మురుగునీటి కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రపరచడం, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్, ఎంపీవో భాస్కర్, కార్యదర్శి తిరుపతి తదితరులు ఉన్నారు.

పాలకుర్తి, ఆగస్టు 7: మొక్కలు నాటి పెంచడం ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని పాలకుర్తి మండల ప్రత్యేక అధికారి శివయ్య అన్నారు. బుధవారం పలు గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఎంపీడీవో పొల్సాని శశికళతో కలిసి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీవో సుదర్శన్,ఏపీవో కొమురయ్య,బసంత్‌నగర్ పీఎస్ వైద్యురాలు, ఐకేపీ సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు, ఆగస్టు 7 : స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో గురువారం శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ భాస్కర్, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీఎం సుధాకర్, ఏవో ఉమాపతి, డాక్టర్ నిస్సిక్రిష్టాన, మాజీ ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వివోఏ, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం, ఆగస్టు 7: మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 3వ రోజు తాగునీటి సంరక్షణ వర్షపు నీటి సంరక్షణలో భాగంగా మచ్చుపేట, లక్కారం, ఖైదంబండ, దరియాపూర్ గ్రామపంచాయతీలలో పర్యటించి, తాగునీటి వనరులు శుభ్రతను పరిశీలించారు. దరియాపూర్ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిభ పరీక్షలను నిర్వహించారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చేనేత కార్మికులను సన్మానిస్తున్న జిల్లా సంఘ అధ్యక్షుడు రాంమ్మూర్తి

సుల్తానాబాద్, ఆగస్టు 7: చేనేత కార్మికులకు ఈ ప్రభుత్వంలో మంచి రోజులు రానున్నాయని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రాంమ్మూర్తి, ఉపాధ్యక్షులు సాయిరి మహేందర్ అన్నారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సొసైటీలో కార్యక్రమాలు జరుపుకున్నారు. పలువురు చేనేత కార్మికులను సన్మానించి వారికి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో యూత్ జిల్లా అధ్యక్షులు మేరుగు యాదగిరి, మండల అధ్యక్షులు గుండా మురళి, భాస్కర్, హరికృష్ణ, తుమ్మ రాములు, లక్ష్మీనారాయణ, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు, ఆగస్టు 7 : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో బుధవారం జాతీయ చేనేత దినోత్సవంను చేనేత కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వాలకు పటు డిమాండ్లు చేశారు. కొన్ని ప్రాంతాల్లో చేనేత కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని వారిని గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూర్ల వెంకటసత్యం, మామిడాల రమేష్, వెంగలదాస్ రాజమౌళి, భాస్కర్, జడల సత్యనారాయణ, బింగి రాజు, కోడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 7: చేనేత రంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు బండారి రాయమల్లు అన్నారు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మార్కండేయ కాలనీలోని శివాలయం ఆవరణలో చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగం జాతీయ స్థాయిలో రెండవ అతిపెద్ద ఆర్థిక వనరులుగా వర్ధిల్లుతుందని, చేనేత రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటుందని, ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకోవాలని, ప్రస్తుతం కనుమరగవుతున్న సహకార సంఘాల వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన కోరారు. అనంతరం గోదావరిఖని వన్‌టౌన్ సీఐ బొద్దుల రవీందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం నర్సయ్య, అనుమ సత్యనారాయణ, గుండేటి రాజేష్, శ్రీనివాస్, మంచికట్ల బిక్షపతి, దాసరి సాంబమూర్తి, వెంగళ బాబు, ఆడెపు దశరథం, బొద్దుల శ్రీనివాస్, గుండేటి శంకర్, వేణు, రజిత, లింగయ్య పాల్గొన్నారు.

తల్లిపాలతోనే రోగ నిరోధక శక్తి..

- మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న చైర్‌పర్సన్ రమ

మంథని, ఆగస్టు 7: బిడ్డలకు తల్లిపాలే చాలా శ్రేష్టమని, రోగ నిరోధక శక్తిలా పని చేస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని బోయినిపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు జవహరి కుమారి, కరుణశ్రీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కులు, తల్లులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 7: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 40, 49వ డివిజన్లలోని అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. మార్కండేయ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమాలకు డివిజన్ కార్పొరేటర్లు దుబాసి లలిత, సన ఫక్రుద్దీన్, అడ్డగుంటపల్లి అర్బన్ హెల్త్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాణికేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత, సీవో అనిత, ఏఎన్ఎం, ఆశా ఆయాలు లావణ్య, మణెమ్మ, లత, గర్భిణులు, బాలింతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రామగిరి ఆగస్టు 7: మండలంలోని బుధవారంపేటలో తల్లిపాల వారోత్సవాలు,అన్నప్రాసన్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్యగౌడ్ పాల్గొన్నారు. అంగన్వాడీ టీచర్స్ బావు శ్రీదేవి, మాధవి, ఆశ వర్క్ భారతి, గర్భిణీ స్త్రీలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, ఆగస్టు 7: సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలకు, తల్లులకు, బాలింతలకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, నాగమల్ల ప్రశాంత్, ఆడెపు సదానందం, సాంబమూర్తి, ఏఎన్ఎం శారద, టీచర్లు విజయలక్ష్మి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తికి దేహశుద్ధి

- పోలీసులకు అప్పగించిన స్థానికులు

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 7 : అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని చెట్టుకు కట్టేసి చెప్పులతో దేహశుద్ధి చేసిన సంఘటన బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జిల్లాకేంద్రంలోని క్రిస్టియన్ కాలనీలో ఓ వ్యక్తి ఉదయం నుంచి అనుమానాస్పదంగా తిరగడంతో పాటు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో అతడిని చెట్టుకు కట్టేసి చెప్పులతో దేహశుద్ధి చేశారు. అనంతరం పెద్దపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి పెద్దపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్టు చేశారు.



లాభాల వాటాను వెంటనే ప్రకటించాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 7: సింగరేణి గడిచిన ఆర్థిక సంవత్సరంలో లాభాలను ప్రకటించాలని జీఎల్‌బీకేఎస్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఓసీపీ-3 ప్రాజెక్టు, వకీల్‌పల్లె గని మేనేజర్లను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు లాభాలను ప్రకటించకపోవడం సరికాదని అన్నారు. లక్ష్యానికి అనుగుణంగా కార్మికులు శ్రమించి సంస్థకు లాభాలు సమకూర్చారని, గతంలో మాదిరిగా వచ్చిన లాభాల్లో కార్మికుల వాటాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. 190 మస్టర్లు పూర్తిచేసుకున్న బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్‌గా ప్రమోషన్ ఇవ్వాలని, సేఫ్టీలో మార్పుల పేరిట అమలు చేస్తున్న రెడ్ కార్డు, ఎల్లో కార్డుల జారీ నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో యూనియన్ ఉపాధ్యక్షుడు ఈసంపల్లి రాజేందర్, శేఖర్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

'కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 7: కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి సులబ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం అన్నారు. ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యాలయంలో బుధవారం సింగరేణి సులబ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, సింగరేణి ప్రాంతంలోని సులబ్ కాంప్లెక్స్‌లలో పని చేస్తున్న కాంట్రాక్ట్‌కార్మికులు పలుసమస్యలు ఎదుర్కొంటు న్నారన్నారు. పదేళ్లుగా సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదన్నారు. సులబ్ కాంప్లెక్స్‌లను శుభ్రం చేసేందుకు వాడే ఫినాయిల్, యాసిడ్, బ్లీచింగ్, తదితర రసాయనాలు వల్ల వారు తరచూ అనారోగ్యం పాలవుతుంటారన్నారు. ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయని, ఇతర అనారోగ్యాల బారినపడి చనిపోయినవాతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మంతెన లక్ష్మయ్య, రాజేందర్, రాములు, కనుకయ్య, సమ్మయ్య, రాజు, వెంకటేష్, శంకర్, లక్ష్మి, జ్యోతి, విజయ, దివ్య, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న డీఎంఎస్ సుధీర్ గణపత్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 7: రామగుండం రీజియన్‌లోని మూడు ఏరియాలకు చెందిన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు భారీ యంత్రా లలో అగ్ని ప్రమాద నివారణపై బుధవారం సింగరేణి యాజమాన్యం అవగాహన సదస్సు నిర్వహించింది. ఆర్జీ-2 ఏరియా ఎంవీటీసీ శిక్షణా కేంద్రంలో జరిగిన ఈకార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ మైన్‌సేఫ్టీ(మెకానికల్) సుధీర్ గణపత్‌రావు ప్రమాదాలకు కారణాలు, జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భారీ యంత్రాలపై పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు రక్షణ పరికరాల వినియోగం గురించి అవగాహన కల్గిఉండాలని, విధుల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రక్షణ సూత్రాలను తూచా తప్పకుండా పని చేస్తే ప్రమాదా లను అరికట్టవచ్చని అన్నారు. ఈందర్భంగా సర్వీస్ ఇంజనీర్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రక్షణ పరికరాల వినియోగంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, సేఫ్టీ ఆఫీస్ వెంకటరమణ, ఏరియా ఇంజనీర్ నర్సింహరావు, ఎంవీటీసీ మేనేజర్ రంగారెడ్డి, సర్వీస్ ఇంజనీర్లు, ఈఅండ్ఎం అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ఎస్‌అండ్‌పీసీ సిబ్బందికి అవగాహన

కోల్‌సిటీ, ఆగస్టు 7: గోదావరిఖని ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో సింగరేణి ఎస్‌అండ్‌పీసీ సిబ్బందికి సైబర్ నేరాలపై బుధవారం రామగుండం కమిషనరేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీఐ జై కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులపై జరుగుతున్న సైబర్ నేరాలు, సైబర్ క్రైమ్స్, క్రెడిట్ రిలేటెడ్ ఫ్రాడ్స్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, అడ్వర్టైజ్‌మెంట్ ఫ్రాడ్స్, ఫెడెక్స్ కొరియర్‌ఫ్రాడ్స్, లోన్‌యాప్‌ల, ఓటీపీ, ఓఎల్ఎక్స్‌ఫ్రాడ్స్ గురించి, సైబర్‌క్రైమ్ వెబ్‌సైట్, 1930 టోల్‌ఫ్రీ ప్రాధాన్యతల గురించి తెలిపారు. ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్ వలన ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయని, సెల్‌ఫోన్ వినియోగం పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగం పెరగడంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని, తమ ఇంటికి వెళ్ళాక తల్లిదండ్రులకు, బంధువులకు, చుట్టూ పక్కల వారికి, మీ గ్రామంలలో కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వెంటనే సైబర్ నేరాల గురించి సైబర్ క్రైమ్ వెబ్‌సైట్, 1930 టోల్‌ఫ్రీ ద్వారా ఫిర్యాదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సిబ్బంది వెంకటేష్, శ్రీనివాస్, శ్రీధర్ ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేష్, అక్బర్ అలీ, చంద శ్రీనివాస్, జమేదర్ శ్రీనివాస్, సెక్యూరిటీ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

'నేతన్నలకు అండగా నిలవాలి'

సుల్తానాబాద్, ఆగస్టు 7: వస్త్రాలు తయారు చేస్తున్న నేతన్నలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని సుల్తానాబాద్ అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులు స్థానిక చేనేత సహకార సంఘాన్ని సందర్శించి నేత కార్మికులు తయారు చేస్తున్న వస్త్రాలను పరిశీలించారు. ఏడవ తరగతిలో తమ పాఠ్య పుస్తకంలో వస్త్రాల తయారీపై ఒక పాఠం ఉందని వారు గుర్తు చేశారు. అనంతరం నేత కార్మికులకు పుష్పాలు అందించి, స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు.

దళితులకు కేటాయించిన భూములు రిజిస్ట్రేషన్ చేయాలి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 7: మండలంలోని కనగర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 199/ఏలో ఉన్న 7 ఎకరాల 20 గుంటల భూమిని 40 ఏళ్ల క్రితం ఎస్సీ మాల, మాదిగలకు అప్పటి ప్రభుత్వం కేటాయించిందని వాటిని తమపై రిజిస్ట్రేషన్ చేయించాలని బుధవారం పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఇప్పటికి భూమి ఖాళీగానే ఉందని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తే ఇళ్ల నిర్మాణాలు చేపడతామని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో బుట్టి అంజయ్య, పర్స రాజయ్య, అంబటి లక్ష్మీనారాయణ, కట్టెకోల నర్సయ్య, గంధం మొగిలి, పర్స శేఖర్, శంకర్, భూపెల్లి శ్రీనాథ్, పర్స రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

రన్నింగ్‌లో ఆనందికి బంగారు పతకం



మెడల్‌తో నల్లవెల్లి ఆనంది

కమాన్‌పూర్, ఆగస్టు 7: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన నల్లవెల్లి భారతి-శంకర్‌ల కుమార్తె నల్లవెల్లి ఆనంది హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించింది. అండర్-16 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ స్టేట్ సెక్రెటరీ సారంగపాణి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంది. అవార్డు అందుకోవడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'అవినీతిరహిత వ్యవస్థ ఏర్పాటుకు కృషి'

పెద్దపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో అవినీతి రహిత వ్యవస్థ ఏర్పాటు చేయుటకు టీజీఎస్పీడీసీఎల్ కృషి చేస్తోందని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బోంకూరి సుదర్శనం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లంచం ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరమని అలాంటి సంఘటనలు ఉంటే టోల్ ఫ్రీ ద్వారా తెలపాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బోంకూరి సుదర్శనం కోరారు. అవినీతి నిరోధక చట్టం తెలిపే వాల్‌పోస్టర్‌లను సర్కిల్ పరిధిలోని అన్ని కార్యాలయాలతో పాటు సబ్ స్టేషన్‌లలో ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా ఫిర్యాదు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1064కు లేదా మొబైల్ నంబర్ 9281033233కు ఫోన్ చేసి తెలపాలని ఆయన కోరారు.

గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో గంగయ్య


పెద్దపల్లి రూరల్, ఆగస్టు 7: గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పెద్దపల్లి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి గంగయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్యం, పరిశుభ్రత, వన మహోత్సవంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో గంగయ్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వీధిలో చెత్త, చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టడంతో పాటు, దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్, ఫాగింగ్ చేయించాలన్నారు. ఈసమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

10న విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు7: విశ్వబ్రాహ్మణ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్(వోపా) రామగుండం నియోజకవర్గం కార్యవర్గం ఎన్నికలు, ప్రమాణ స్వీకారం శనివారం గోదావరిఖనిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరుగుతుందని అధ్యక్ష, కార్యదర్శులు కట్ట సత్యనారాయణ, పానుగంటి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వోపా కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి, రాష్ట్ర కన్వీనర్ కట్ట విష్ణువర్ధన్, జిల్లా అధ్యక్షుడు ఎర్రోజను రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి కాసర్ల శ్రీనివాస్ హాజరై ఎన్నికలు నిర్వహించి ప్రమాణ స్వీకారం చేయిస్తారని పేర్కొన్నారు. వోపా సభ్యులు సకాలంలో హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

-ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్



మాట్లాడుతున్న రజనీకాంత్

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 7: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 6,7 తేదీల్లో జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ హాజరై మాట్లాడారు. విద్యారంగంలో అనేకమైన సమస్యలు నెలకొన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా విద్యారంగంపై చిన్న చూపును వీడి విద్యాశాఖ మంత్రిని వెంటనే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్ నాయకులు నాగుల శివ, గద్దల సిద్ధార్థ, రోషన్, నవీన్, సాగర్, రాజు, నితిన్, ఉదయ్, మనీషా, రవళి, జోష్న, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

సీఐపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 7: దొంగతనం చేసిందనే నెపంతో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సీఐ రాంరెడ్డి, మరో నలుగురు కానిస్టేబుళ్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి రాజరత్నం, నాయకులు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బంగారం దొంగతనం చేసిందని అనుమానితులై సునీతను, ఆమె కుమారుడు జగదీష్‌ను చిత్రహింసలు పెట్టిన సీఐ రాంరెడ్డిని, మరో నలుగురు కానిస్టేబుళ్లను తక్షణమే విధుల్లో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గౌస్, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.